# మణిద్వీప రహస్యం



శ్రీసుధామయి

# మణిద్వీప రహస్యం




**అ**ది సుసంపన్నమై సుభిక్షమై పాడిపంటలతో పచ్చనిచేలతో అలరారుతూ ఇరుగుపొరుగు దేశాలకు తలమానికంగా నిలిచిన మణిమేఖల రాజ్యం..

పరాక్రమవంతుడు శూరుడు అయిన అయిన రాజు మహీపాలుడు తన రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలించేవాడు. మహీపాలుడి పరిపాలనలోని ప్రజలు శాంతిభద్రతలతో సుఖంగా జీవించేవారు..

రాజుగారి ధర్మపత్ని మందారవల్లి. సుగుణవతి అనుకూలవతి

అయిన మహారాణి మహారాజుకు పరిపాలనలో చేదోడువాదోడుగా ఉండేది..

మహీపాలుడు మందారవల్లిల ఏకైక కుమార్తె గారాలతనయ యువరాణి మయూరలేఖిని. యుక్తవయసులో ఉన్న రాకుమారి అపురూపసౌందర్యరాశి సుగుణాలరాశి మాత్రమే కాక కత్తియుద్ధంలోను గుర్రపుస్వారీలోను విలువిద్యలోను తనకు చుట్టుపక్కల రాజ్యాలలో ఎవరూ సాటి లేరని పేరు తెచ్చుకుంది. మయూరలేఖిని ని పరిణయమాడాలని అనేక రాజ్యాల రాకుమారులు ఉవ్విళ్లూరేవారు..

మహారాజుకి పరిపాలనలో సహకరిస్తూ తన మేధాశక్తితో శత్రువుల ఎత్తుజిత్తులను తిప్పికొట్టి రాజ్యాన్ని రక్షించుకోవడంలోనూ , ప్రజలకు పన్నులభారం కాకుండా పన్నులకొరత లేకుండా సమతూకంగా వ్యవహరిస్తూ ఖజానా ఖాళీ కాకుండా ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతూ సమర్థవంతమైన దక్షతాపరుడిగా పేరొందిన సుమేధుడు మహీపాలుడికి మణిమేఖల రాజ్యానికి మహామంత్రి..

మహారాణి మందారవల్లికి సోదరుడి వరుసైన కందర్పకేతు మణిమేఖల రాజ్యానికి సేనాధ్యక్షుడు. యువరాణి మయూరలేఖిని ని పరిణయమాడి మహారాజుకు దశమగ్రహంగా మారడమే కాక సింహాసనాన్ని దక్కించుకోవాలని కలలు కంటూ కుట్రలు పన్నుతున్నాడు. కుయుక్తులతో పథకాలతో కొంతసైన్యాన్ని తనకు

అనుకూలవర్గంగా ఏర్పాటు చేసుకుని కుట్రలు కుతంత్రాలు రచిస్తూ రాజ్యంలో అల్లకల్లోలం సృష్టిస్తూ ఉన్నాడు. కానీ సుమేధుడి రాజనీతితంత్రాల వలననో మహారాజు గారి మంచితనం వలననో కందర్పకేతు సృష్టించే అల్లకల్లోల పరిస్థితులు నివురు గప్పిన నిప్పులా ఉంటూ వచ్చాయి.

ఆ రోజు సభ ముగిసింది. ప్రజాదర్బారులో ప్రజలసమస్యలను వింటూ సానుకూలంగా స్పందించడమే కాక వాటికి పరిష్కారాలను సూచిస్తూ తక్షణమే అవి అమలు జరిగేలా ఆదేశాలిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్న రాజు మహీపాలుడిని మంత్రి సుమేధుడిని యథాప్రకారం వేనోళ్ల పొగుడుకుంటూ ప్రజలు తమ తమ గృహాలకు వెళ్లసాగారు.

సింహాసనం దిగి తన మందిరానికి వెళ్లబోతున్న మహారాజు వద్దకు సుమేధుడు వచ్చాడు ప్రభూ అంటూ.. వెళ్లబోతున్న మహారాజు ఆగిపోయి చెప్పండి మహామంత్రి ఇంకేమైనా సమస్యలు మిగిలి ఉన్నాయా అని అడిగాడు. అప్పుడు సుమేధుడు ఈ రోజు ఇంకే సమస్యలు లేవు ప్రభూ. ఈ రోజు పౌర్ణమి కదా తమకు ఒకసారి ఎరుక చేయాలని పిలిచాను అన్నాడు.

అది విన్న మహారాజు అవును మహామంత్రి సమయానికి బాగా ఎరుక చేశారు అంటూ తన మందిరానికి సాగిపోయాడు.

కొంత సమయం గడిచాక మహారాణి మందారవల్లికి తాను అంతఃపురానికి వస్తున్నట్టు కబురు పంపాడు మహారాజు. వార్త

మోసుకొచ్చిన పరిచారిక మహారాణి చెలికత్తెలకు ఈ విషయం తెలిపింది. అందులో మహారాణికి ప్రధాన చెలికత్తె అయిన మంజరి రాజుగారు వస్తున్న విషయం తెలియచేసింది. అది విన్న మహారాణి వేగిరపడుతూ తాను స్వయంగా అల్లుతున్న పూమాలలను ఇంకా ఇతర పూజాద్రవ్యాలను వేగిరం సిద్ధం చేసింది. అంతఃపురంలో అడుగుపెట్టిన మహారాజును చెలికత్తెలు స్వాగతం పలుకుతూ లోపలికి తీసుకువచ్చారు. రాజుగారిని చూడగానే రాణికి వింజామరలు వీస్తున్న పరిచారికలు నమస్కరించి పక్కకు తప్పుకున్నారు.

రాజుగారు లోపలికి రాగానే మహారాణి సిద్ధంగా ఉన్నారా బయలుదేరుదామా అని అడగగానే మహారాణి వెళ్లడానికి ఉద్యుక్తురాలయింది.

రాజు రాణి ఇద్దరూ కలిసి రాజప్రాసాదం బయటికి వచ్చారు. అప్పటికే అక్కడ యువరాణి మయూరలేఖినితో పాటు భటులు ఇతర సైనికులు కొంతమంది పురప్రజలు అందరూ కలిసి రాజ్యానికి కొన్ని క్రోసుల దూరంలో ఉన్న పరమేశ్వరీదేవి సన్నిధికి బయలుదేరారు.

రాజుగారు రాణి రథం మీద వస్తుంటే మయూరలేఖిని తన గుర్రం మీద వస్తోంది. మిగిలిన భటులు ఇతర సైనికులు పురప్రజలు అందరూ కాలినడకన సాగుతున్నారు.

తొలిఝాము గడుస్తుండగా వారందరూ పరమేశ్వరిదేవి కొలువై

ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. ఆ రోజు పౌర్ణమి కావున రాజుగారు తన పరివారంతో అక్కడికి చేరుకుంటారని ముందే తెలిసినందున అక్కడ ఉన్న సైనికులు అన్నీ సిద్ధంగా ఉంచారు. తెరిచి ఉన్న ప్రహరి తలుపుల ద్వారా రథం లోపలికి ప్రవేశించింది. మిగిలినవారు లోపలికి ప్రవేశించారు.

***

ఆ రోజు నిండుపౌర్ణమి అయినందున వెన్నెల పుచ్చపూవులా వెలిగిపోతోంది. కానీ రాజుగారు పరివారం వస్తున్నందువలన అక్కడక్కడా కాగడాలను వెలిగించి ఉంచారు. ఎదురుగా ఒక గుహ. ఆ గుహ చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ. ప్రహరీ నుండి లోపలివైపుకి లోతైన కందకం. గుహ చుట్టూ కందకాన్ని తవ్వి నీటితో నింపి అందులో మొసళ్ళను వదిలారు. కందకాన్ని ఆనుకుని ముందువైపుకి గుహ ప్రధాన ద్వారంగా రాతి తలుపులు. రాతితలుపుల వద్దకు ఒక పెద్ద చెక్కపలక. అక్కడున్న సైనికుడు మీట నొక్కగానే ఆ చెక్కపలక ముందుకి పరుచుకుంది. ఆ చెక్కపలక మీదుగా రాజు ఇతర పరివారం రాతి తలుపుల వద్దకు చేరుకున్నారు. రాజు మహీపాలుడు తన చేతివ్రేలికి ఉన్న ముద్రిక ను తీసి రాతితలుపుల మీద ఉన్న మీటలో అచ్చులా ముద్రించాడు.

మానవమాత్రులు కానీ అతికాయులు కానీ మహాబలశాలులు వస్తాదులు కానీ అంగుళమైనా కదపలేని ఆ రాతి తలుపులు రాజు

తన ముద్రికను ఉంచగానే మెల్లిగా తెరుచుకున్నాయి. గుహాలోపల కటికచీకటి పహారా కాస్తోంది. కాగడాలను పట్టుకుని భటులు ప్రవేశించారు. ఆ వెలుతురులో రాజు రాణి యువరాణి మిగిలిన పరివారం అంతా ముందుకు నడవసాగారు. కొంచెం ముందుకు నడిచాక అక్కడున్న ఇనుపద్వారాలను కొంతమంది సైనికులు తెరిచారు. మరికొంతముందుకు నడవగానే అక్కడున్న రజతద్వారాలను తెరిచారు. రాజపరివారంలో ఉన్న పురజనులలో కొంతమంది పరదేశీయులు ఉన్నారు. వారికి గుహాలో ద్వారాలు తెరవడం గుహాలో నడవటం చాలా వింతగా అనిపిస్తోంది. ముందు ముందు ఇంకా ఏమేమి ఉన్నాయో అని ఉత్కంఠ తో అందరితోపాటు ముందుకు సాగుతున్నారు.

మరికొంత ముందుకు వెళ్లగానే అక్కడ పసిడిద్వారాలు ఆ కాగడాల వెలుగులో పచ్చగా మెరిసిపోతున్నాయి. రాజుగారి ఆదేశం మేరకు ఆ బంగారు తలుపులను సైనికులు తెరిచారు. అందరూ ఆ పసిడి తలుపుల బైటనే ఆగిపోయారు. మహారాజు మహారాణి యువరాణి మాత్రమే లోపలికి ప్రవేశించారు.

ఎదురుగా ప్రసన్నవదనంతో మాతా పరమేశ్వరీదేవి. కాగడాల వెలుతురు పరమేశ్వరీదేవి వదనంపై ప్రతిఫలిస్తూ చూసేవారికి సజీవకళ ఉట్టిపడుతోందని అనిపిస్తోంది. పరమేశ్వరీదేవి కంఠంలో అలంకరించిన "మణిహారం" తళుక్కుమని మెరిసిపోతోంది. ఇంతలో తొలిఝాము గడిచింది అని తెలియచేయడానికి నగారా

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Manidweepa+Rahasyam](http://kinige.com/book/Manidweepa+Rahasyam)

* * *